## శ్రీశైలం ఆనకట్టను పరిశీలించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

**(మొదటి పేజీ తరువాయి ) :** జరిగిందని తెలిపారు.ఈ నేపధ్యాంలోనే అప్రోచ్‌రోడ్డు, శ్రీశైలం-హైదరబాద్ రోడ్డు కూడా సైడ్ వాల్స్‌ను కూడా పరిశీలించడం జరిగిందని అన్నారు.మొదటి విడతగా 103 కోట్ల రూపాయలను వ్యయంతో పనులను చెప్పట్టడానికి వారు ముందుకు వచ్చారని అన్నారు.త్వరలోనే పనులకు సంబందించి వీలైనంత త్వరలోనే టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని చెప్పారు.ఈ పరిశీలనలో యాంజి జెలాక్సి వరల్డ్ బ్యాంకు టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్ యాంజి జెలాక్సి,యాంజి సేల్వమణి సిడబ్ల్యూసి టెక్నికల్ ఆడ్వజరి కమిటికి మెంబర్,వరల్డ్ బ్యాంకు టెక్నికల్ టీం లీడర్స్ ముక్కల రమేష్,మరియు రాజగోపాల్ సింగ్,సిడబ్యూసి డాక్టర్ హనీ,సేట్ డ్యాం సేప్టి ఆర్గనైజషన్ చీప్ ఇంజనీరు కుమార్,సిఈ కబీర్‌బాషా,డ్యాం ఎస్.ఈ శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గోన్నారు.

## కాత్యాయణిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ చౌడేశ్వరిదేవి

**బనగానపల్లెరూరల్, అక్టోబర్8, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం నందు దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆరవ రోజు మంగళవారం అమ్మవారిని ప్రాత:కాలం నందు మేల్కోపుచేసి అభిషేకం, నిత్యార్చన వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగశాల నందు ఆలయ వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆవాహిత దేవత పూజలు, విశేష పూజా క్రతువులు, చండీపారాయణం, సహస్ర నామార్చన, వేదపారాయణం నిర్వహించారు. ఈ మేరకు దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని ఆరవ రోజు కాత్యాయణిదేవి అలంకారంలో చల్లని దీవెనలను భక్తులను అనుగ్రహించారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా సాయంకాలం అమ్మవారికి ఆలయ ప్రాంగణంలో ప్రాకార రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి మరియు ఆలయ అసిస్టెంట్ కమిషన్ జి.కామేశ్వరమ్మ, నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పి.వి.కుమార్‌రెడ్డి, ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కోడుమూరు మద్యం దుఖాణాలకు 230 ధరఖాస్తులు

**కోడుమూరు,అక్టోబర్ 8, ప్రభాతవార్త :** ఈ నెల 12 వ తేది నుంచి ప్రారంభమయ్యే ప్రైవేటు మద్యం దుఖాణాలకు ఇప్పటి వరకు కోడుమూరు ఎక్సైజ్ పరిధిలో ఏర్పాటు చేసిన 14 మద్యం దుఖాణాలకు మంగళవారం సాయంత్రం వరకు 230 దరఖాస్తులు నమోదు చేసుకున్నారు. ధరఖాస్తుల స్వీకరణకు 9వ తేదితో ముగియనున్నదంతో ఆశావాహులంతా ధరఖాస్తుల నమోదుకు పరుగులు పెడుతున్నారు. ఈ నెల 1వ తేది నుంచి ప్రారంభమైన ధరఖాస్తుల స్వీకరణలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు మందకొడిగా సాగిన ధరఖాస్తుల నమోదు కార్యక్రమం గత రెండు రోజుల నుంచి వూపందుకుంటున్నాయి. మద్యం షాపుల ధరఖాస్తులకు ఇంకా ఒక్క రోజు మిగిలి ఉండడంతో దరఖాస్తుదారుల నుంచి వేగం పుంజుకుంటున్నాయి. గత ఐదేళ్ల పాటు గత ప్రభుత్వ విధానాలతో సాగిన మద్యం విక్రయాలకు నేటి కూటమి ప్రభుత్వ విధానాలు త్వరలో అమలులోకి వస్తున్నదంతో అందరి దృష్టి ఇక్కడ ఏర్పాటయ్యే ప్రైవేటు మద్యం విక్రయాలపై అందరినీ అసక్తిరేకితిస్తోంది. ప్రభుత్వ మద్యం దుఖాణాల ద్వారా తమ వ్యాపారాలకు గండి పడిందని గత ఐదేళ్ల పాటు నిరాశపడిన మద్యం వ్యాపారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ రాష్ట్రంలో ప్రైవేటు మద్యం అమ్మకాలకు శ్రీకారం చుట్టడం మద్యం వ్యాపారులంతా హర్షిస్తున్నారు. నాణ్యమైన మద్యంను ఈ నెల 12వ తేది నుంచి ప్రారంభం అవుతున్నదంతో మద్యం ప్రియులంతా ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నారనే చెప్పాలి. స్థానిక ఎక్సైజ్ అధికారులు ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ ద్వారా మద్యం దరఖాస్తులను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో స్వచ్ఛందంగా పలువురు ఎవరికీ వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. గత ఐదేళ్ల పాటు ప్రైవేటు మద్యం విక్రయాలకు నిరీక్షించిన వ్యాపారుల కళ ఈ నెల 11 వతేదితో వారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆ అదృష్ట వంతులెవ్వరో.. వేచిచూద్దాం...

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

**- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఉమామహేశ్వరమ్మ**

**బనగానపల్లె, అక్టోబర్8, ప్రభాతవార్త:** బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో గల బనగానపల్లె మండలంలోని వెంకటాపురంలో ఈడబ్ల్యూఎస్-1, పలుకూరులో ఎస్సీ-1, అవుకు మండలంలోని కొండమనాయునిపల్లె బీసీ(బీ)కి -1, సంజామల బీసీ(డీ)కి-1 కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడులో ఎస్సీ-1 ఆయా పోస్టులకు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే సంజామలో ఎస్సీ-1 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అర్హతలుగా అభ్యర్ధులు 10వ తరగతి పాసై ఉండాలని, అలాగే అంగన్‌వాడీ ఆయా పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలని ఒకవేళ 10వ తరగతి వారు లేనియెడల ఎక్కువ చదివి చదివి పాసై ఉండవలెనన్నారు. ఎస్సీ, ఎస్టీ జనావాసా ప్రాంతాల్లో అభ్యర్థినిలల్లో 21 సంవత్సరాలు నిండినవారు లేనిచో దిగువ వయస్సు 18 సంవత్సరాలు వారిని పరిగణలోనికి తీసుకోబడునన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్ధులు పుట్టిన తేది లేదా వయస్సు ధృవీకరణ పత్రం, కులధృవీకరణ పత్రం, విద్యార్హత ధృవీకరణ పత్రం, 10వ తరగతి మార్కు లిస్ట్, టిసి అలాగే 10 కంటే ఎక్కువ తరగతి చదివిన మార్క్ లిస్ట్, టిసి, నివాస ధృవీకరణ పత్రం, వితంతువు అయినచో భర్త మరణ ధృవీకరణ పత్రం, 18సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నచో వారి యొక్క వయస్సు ధృవీకరణ పత్రం, వికలాంగులైనచో పిహెచ్ఏ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తు వెంట జతచేయాలని ఆమె సూచించారు. దరఖాస్తులను ఈనెల 10వ తేది నుండి 21వ తేదిలోపు సాయంత్రం 5గంటల లోపు సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

## ఎవరికి భయపడాల్సిన పనిలేదు

**కొలిమిగుండ్ల, అక్టోబర్8, ప్రభాతవార్త:** వైన్‌షాప్‌ల నిర్వహణ కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని వారు ఎవరికి భయపడాల్సిన పనిలేదని బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకునిరావడం జరిగిందని దానికి దరఖాస్తు గడువు నేటితో ముగుస్తున్నందున దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుదారులు ఎవరికి భయపడాల్సిన అవసరంలేదని ఎవరైనా ధైర్యంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బనగానపల్లెలో 7షాప్‌లు, అవుకులో 2షాప్‌లో, కొలిమిగుండ్లలో 3షాప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మొత్తం 12 షాప్‌లకు గాను 37 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా కొలిమిగుండ్ల మండలంలో 3షాప్‌లకుగాను కేవలం 3 దరఖాస్తులు మాత్రమే వచ్చినందున ప్రజల్లో ఉన్న అపోహలు పోగొట్టాలనే ఉద్దేశ్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఏమైనా సలహాలు కావాలంటే సెల్ నంబర్ 9440902585కు ఫోన్ చేయాలని ఆమె తెలియజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికి డిప్ తగిలినా మా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. గతంలో కొలిమిగుండ్ల మండలంలో కొలిమిగుండ్ల, బెలుం మరియు అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో మాత్రమే వైన్‌షాప్‌లు నిర్వహించేవారన్నారు. అయితే ఇప్పుడు డిప్ తగిలిన వారు మండలంలో ఎక్కడైనా వారికి నచ్చినచోట షాప్‌ను పెట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

## నాటుసారా స్థావరాల పై దాడి

**హొళగుంద, అక్టోబర్8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట గ్రామాల్లో బన్ని ఉత్సవాల సందర్భంగా ఆలూరు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు తదితర గ్రామాల్లో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నెరనికి గ్రామ కొండల్లో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన బోయ రవి, హొసల్లి శ్రీరాములు 150లీటర్ల నాటుసారాను నిల్వ ఉంచారన్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేశామని వారు తెలిపారు. ఎవరు కూడా నాటుసారా, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కావునా అక్రమ మద్యం, నాటుసారా, బెల్లంఊట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## మద్యం షాప్‌లకు దరఖాస్తు చేసుకోండి



**బనగానపల్లె, అక్టోబర్8, ప్రభాతవార్త:** బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్ఐ కమలాకర్ మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తుందని, ఈ దరఖాస్తులను ఈనెల 9వ తేది సాయంత్రం 5గంటల వరకు ఆశావాహుల నుండి స్వీకరించనున్నందని తెలిపారు. బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బనగానపల్లె మండలం నందు 7 మద్యం షాప్‌లు, అవుకు మండలం నందు 2 మద్యం షాప్‌లు, కొలిమిగుండ్ల మండలం నందు 3 మద్యం షాప్‌లకు దరఖాస్తుదారులు చివరి రోజు వరకు ఎదురు చూడకుండా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్దతిలో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. దరఖాస్తుదారులు ఆశావాహులు నేషనలైజ్‌డ్ బ్యాంకు, షెడ్యూల్డ్ బ్యాంకు నుండి డిమాండ్ డ్రాఫ్ట్‌లను కూడా స్వీకరించబడునని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందుగాని మరియు సీఐ నంబర్ 9440902589 మరియు నంద్యాల డీపీఈవో నంబర్ 8008828467 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

## గంజాయి విక్రయదారుల అరెస్ట్

**- 6.100కేజీ గంజాయి స్వాధీనం**

**సిబెళగల్, అక్టోబర్8, ప్రభాతవార్త:** సిబెళగల్ మండలంలో చెరువుపల్లె గ్రామంలో ఇద్దరు గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు చెరువుపల్లె గ్రామానికి చెందిన మిద్దె భూపతి రాముడుకు చెందిన సర్వే నంబర్ 472 పొలంలో సిబెళగల్‌కు చెందిన మాల హనుమంతుతో కలిసి గంజాయి మొక్కలను సాగు చేస్తున్నదన్న సమాచారం అందిందన్నారు. ఈ మేరకు కోడుమూరు సీఐ ఆదేశాల మేరకు మండల డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో బోయ తలారి వెంకటేశ్వర్లు, కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజులతో కలిసి పొలం వద్దకు చేరుకున్నమన్నారు. అప్పటికే భూపతి రాముడు, మాల హనుమంతులు గంజాయి మొక్కలను పీకి వాటి ఆకులను ప్లాస్టిక్ సంచులో నింపి బయలుదేరేందుకు ఇద్దంగా ఉన్నరన్నారు. ఈ మేరకు భూపతి రాముడు నుంచి 4.100కేజీలు, మాల హనుమంతు నుంచి 2 కేజీలు గంజాయిను స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో, స్థానిక పోలీసులతోపాటు కోడుమూరు పోలీసులు పాల్గొన్నారు.

## వివిధ ప్రాంతాల్లో కొలువైన దుర్గామ్మ విగ్రహాలు

**- రూ.లక్ష కరెన్సీతో రాయల్ కూరగాయల మార్కెట్ దుర్గమ్మ అలంకరణ**

**- 12న కైప చెరువులో విగ్రహాల నిమజ్జనం**

**బనగానపల్లె, అక్టోబర్8, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని గతంలో ఎన్నడులేని విధంగా వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి మహోత్సవాల తరహాలో మండపాలు ఏర్పాటుచేసి దుర్గాదేవి విగ్రహాలను కూర్చోబెట్టి పూజలు చేస్తుండడంతో బనగానపల్లె పట్టణంలో దసరా శరన్నవరాత్రి శోభ సంతరించుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన వెంటనే పట్టణంలోని రాయల్ కూరగాయల మార్కెట్, కాలేజి మైదానం, బుడగజంగాల కాలనీ, నేలమఠంలతోపాటు మండలంలోని పలుకూరు, యనకండ్ల గ్రామాల్లో సైతం ప్రత్యేక మండపాలను ఏర్పాటుచేసి దుర్గమాత విగ్రహాలను కూర్చోబెట్టారు. ప్రతిరోజు వివిధ అలంకారాలతో అమ్మవారిని అలంకరిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని కొండపేట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవస్థానంలో వాసవిమాత, మంగళవారంపేట అమ్మవారిశాలలో వాసవి కన్యకాపరమేశ్వరి, బ్రహ్మంగారి ప్రథమ పీఠమైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ప్రతిష్ఠించిన శ్రీ కాళికాంబ, రవ్వలకొండ క్షేత్రం బ్రహ్మంగారి గుహల వద్ద గాయత్రిదేవి, బేతంచెర్ల రహదారిలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో కొలువైన గాయత్రిమాత అమ్మవార్లకు ప్రతిరోజు వివిధ అలంకారాలతో అలంకరిస్తూ నిత్యం పూజలు చేస్తున్నారు. మండపాల వద్ద కూడా ప్రతిరోజు రాత్రి అర్చక స్వాములచే అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు మండపాల వద్దకు వెళ్లి అమ్మవారి పూజల్లో పాల్గొంటూ తీర్థప్రసాదాలను అందుకుని అమ్మవారి కృపకు పాత్రులవుతున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వాహకులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకుంటున్నాయి. బుధవారం రాయల్ మార్కెట్ మండపంలో అమ్మవారు రూ.500, రూ.100, రూ.50ల నోట్లతో మొత్తం లక్ష రూపాయలతో అలంకరించి ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల్లో కొలువైన అమ్మవార్లకు విజయదశమి రోజున పూర్ణాహుతి గావించి ఊరేగింపుగా తీసుకువెళ్లి టంగుటూరు రహదారిలో కైప చెరువు దగ్గర ఘాట్‌లో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రైతుల మొక్కజోన్న పంటను దోచుకెళ్తున్న దొంగలతో భయం.. భయం..!

**: జాతీయ రహదారిపై రైతు సాగు చేసిన మొక్కజోన్న దాన్యాన్ని చోరీ చేసేందుకు ప్రయత్నం**



**ఆత్మకూరు,అక్టోబర్08,ప్రభాతవార్త:** ఎండకు వానకు తడసి రాత్రి పవలు పంటను కంటికి కన్నురెప్పాల కాపాడుకుంటూ భూమిని నమ్ముకున్న రైతు కష్టాన్ని దోచుకునేందుకు దొంగల బెడదతో రైతన్నలు భయం.. భయంతో.. ఆందోళనకు గురవుతున్నారని చెప్పవచ్చు. మంగళవారం పట్టణంలోని నేషనల్ హైవే ఎన్‌హెచ్ 340సి రహదారిపై రైతన్నలు సాగు చేసిన మొక్కజోన్న దాన్యాన్ని రోడ్డుపై ఆరాబెట్టుకొని సరైన ధర వస్తే విక్రయాలు జరిపేందుకు కాటా వేసుకొని రైతులు భద్ర పర్చుకు న్నారు. అయితే పట్టణానికి చెందిన ఓ దొంగ ఏకంగా మొక్కజోన్న దాన్యం ప్యాకెట్లను దొంగలించేందుకు ప్రయత్నం చేశాడని మండల పరిధిలోని బాపణంతాపురం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు విలేకరులకు తెలియజేశారు. 2ఎకరాల విస్తీర్ణంలో మొక్కజోన్న పంట సాగు చేయడంతో 14ప్యాకెట్లు మొక్కజోన్న దాన్యం రావడం జరిగిందని రైతు తెలిపారు. పక్కనే పొలంలో సాగు చేసుకుంటూ దాన్యాన్ని చూసుకుంటూ పొలం పనులో ఉండడంతో పట్టణానికి చెందిన ఓ దొంగ మొక్కజోన్న దాన్యం ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై పెట్టుకొని వెళ్తూన్న క్రమంలో తోటి రైతులు చూసి వెంటనే అడ్డుకున్నారు. ఆ దొంగపై స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో రైతులు అందరు కలసి వెంటనే దొంగను పట్టుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించడం జరిగింది. అడుగడుగున ధరలు లేక మోసపోతున్న రైతన్న లకు మరో భయం పట్టుకుంది. రాత్రివేళ సమయంలో రైతుల కష్టాన్ని దోచుకోని ఎక్కడా తమ ధాన్యాన్ని దొంగలపాలు అవుతాయో అంటూ పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాలలో మొక్కజోన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు దొంగల బెడద నుంచి రక్షణ కల్పించాలని పలువురు రైతులు మీడియా ముఖంగా వాపోయారు.

## గజలక్ష్మి భవాని దేవిగా అమ్మవారు

**చాగలమర్రి,అక్టోబర్ 8,ప్రభాతవార్త:** దసరా ఉత్సవాలలో బాగంగా చాగలమర్రిలో భవానిదేవిగా, ముత్యాలపాడు గ్రామంలో గజలక్ష్మిగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శన మిచ్చారు. ప్రత్యేక రూపాల్లో దర్శనం ఇచ్చిన అమ్మవారికి రుద్రాభిషేకం, నవగ్రహ జపములు, స్వస్తివాచకం, దేవి నవగ్రహ భాగవత పారాయణం తన్మయ సూక్తం దీక్ష హోమం,సుదర్శన మూలమంత్ర హోమం, మంగళ తీర్థ ప్రాసదం పూజ కార్యక్రమాలు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు ఆధ్వర్యంలో జరిగాయి. అలాగే మండలంలోనిముత్యాలపాడు గ్రామంలో అమ్మవారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడియం లక్ష్మీనరసింహులు, కిరణ్‌కుమారి మాధవ, నరసింహక్కయ్యా, అంబిక శ్రీధర్, నరసింహయ్య వాసవి బింగుమల్ల రామసేసయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపత్ని విజయలక్ష్మిలు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ముడియం మాధవ, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు లక్ష్మణబాబు, నవతా ప్రసాద్, మల్లికార్జున,బాబు, ఉపాధ్యక్షుడు ముడియం రామక్రిష్ణ, కార్యదర్శి ముడియం వెంకటరమేష్, మంచి కంటి సురేష్‌బాబు, మహిళలు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రవేత్తలు పొలాల సందర్శన..

**:-పొలం పిలుస్తోందిలో రైతులకు పలు సలహాలు..**

**కోసిగి, అక్టోబరు 8, ప్రభాతవార్త :** కోసిగి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మండలంలోని పలు రైతుల పొలాలను సందర్శించారు..మంగళవారం కోసిగి మండల వ్యవసాయాధికారి రాజు నేతృత్వంలో శాస్త్రవేత్తలు మండలంలోని చింతకుంట, కోసిగి, పల్లెపాడు గ్రామాల పరిధిలో ఉంటున్న రైతుల పొలాలలో పర్యటించి రైతులు వేసుకున్న పంటలను వారు సాగుచేసే విధానాన్ని పరిశీలించారు.. ముందుగా వ్యవసాయాధికారి రాజు పొలాల్లో పంటలు వేసుకున్న ప్రతి రైతు ఈకెవైసి చేయించుకుని పంట నమోదు చేసుకోవాలని సూచించారు.. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ వేదామణి, కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి నుండి డాక్టర్ మౌనిక, శ్రీచందనలు పొలాల్లో పర్యటించి పత్తి, ఉల్లి, మిరప పంటలను సమీక్షించారు..ఈసందర్భంగా మిరపలో తెల్లదోమను గమనించారు..దీని నివారణకు గానూ ఎకరాకు నీలిరంగు, పసుపు రంగు అట్టలు పెట్టుకోవాలన్నారు.. రసం పీల్చే పురుగుల నివారణకు ఇథియోపెన్ ప్రాక్స్, దయాఫెంధియోరాన్ ఒక గ్రాము ఒక లీటరునీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు..అనంతరం పలు రైతుల పొలాలను పరిశీలించారు.. ఈ కార్యక్రమంలోఏపిఎంఐపి నాగరాజు మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లీర్సులు అవసరమున్న రైతులు రైతు భరోసా కేంద్రాలల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రవీంద్ర, శేఖర్, రాజశేఖర్, పవిత్ర, పాల్గొన్నారు..

## ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పిలు రాజీనామా

**జూపాడుబంగ్లా, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పిలు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ గంగాధర్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. 80 బన్నూరు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పిగా పనిచేస్తున్న ప్రత్యూష ఉన్నత చదువుల కోసం ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా తంగడంచలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్‌క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పిగా పనిచేస్తున్న కల్పన ఇతర దేశాలకు వెళ్లెందుకోసం రాజీనామా చేశారన్నారు. వీరి రాజీనామాల పత్రాలను జిల్లా వైద్యాధికారికి పంపినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు.

## మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

**ఆలూరు రూరల్, అక్టోబర్8, ప్రభాతవార్త:**

ఆలూరు పట్టణంలో కోటవీధిలో సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆలయంలో అమ్మవారికి తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆరవ రోజు మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుండే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, మహామంగళహారతి నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## వాహన రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలి

**- ఎస్ఐ బాల నరసింహులు**

**హొళగుంద, అక్టోబర్8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన హొళగుందలోని ఎల్లార్తి రోడ్డులో మంగళవారం వాహన రికార్డుల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హొళగుంద ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రికార్డులు క్రమంగా ఉండేలా చూసుకోవాలని లేనిచో వాహనాలకు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. వాహనాల్లో కూలీలను పరిమితికి మించి తరలించకూడదన్నారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ప్రభుత్వ న్యాయవాదిగా సిద్ధప్ప

**- సిద్ధప్పను సన్మానించిన బార్ అసోసియేషన్ సభ్యులు**

**ఆలూరు రూరల్, అక్టోబర్8, ప్రభాతవార్త:**

ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది సిద్ధప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దప్పను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిద్దప్ప ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నాయకులు జనార్దన్, విజయ్‌భాస్కర్, వీరేష్, సీనియర్ న్యాయవాది వాయుజీవోత్తమరావు, వలి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కార్యకర్త గోవిందప్ప భార్య మృతి

**- నివాళులు అర్పించిన టీడీపీ సీనియర్ నాయకులు**

**కౌతాళంరూరల్, అక్టోబర్08, ప్రభాతవార్త;**

మండలంలోని లింగాలదిన్నె గ్రామ టీడీపీ సీనియర్ కార్యకర్త గొల్ల గోవిందప్ప భార్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు మూడి ఉలిగయ్య గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆత్మకు శాంతి చేకూరాలను ప్రార్థించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఆయన భరోసానిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నాయకులు కాత్రికి చంద్రన్న, ఈరన్న, వెంకటేష్, మారెప్ప, చెన్నబసవ, లక్కోగోవిందు, మౌనేష ,మణికంఠ, యంకన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఇంటర్‌లో విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి

**నంద్యాల , 08 అక్టోబర్, ప్రభాతవార్త, ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తప్పనిసరిగా 75శాతం హాజరు ఉండాలని బోర్డు కార్యదర్శి కృతికాశుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి, రెండో ఏడాది చదివే రెగ్యులర్ విద్యార్థులకు 75శాతం కంటే తక్కువ హాజరు శాతం ఉంటే అపరాధ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. 60-65శాతం ఉంటే రూ.2వేలు, 65-70శాతం ఉంటే రూ.1500లు, 70-75శాతం ఉంటే రూ.1000ల అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలి

**- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**

**బనగానపల్లెరూరల్, అక్టోబర్8, ప్రభాతవార్త:** మన భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని ప్రతిఒక్కరు గౌరవించాలని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని స్థానిక కొండపేట అమ్మవారిశాల వద్ద ఉన్న సుధీర్ నివాసంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును మంగళవారం బీసీ రాజారెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా సుధీర్ ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం మంచి సాంప్రదాయమన్నారు. అలాగే వారి పూర్వీకుల నుంచి వచ్చిన సాంప్రదాయాన్ని గౌరవిస్తూ గత 70సంవత్సరాలుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఎంతోగానో ఆకట్టుకునే కళాకృతులతో గొప్ప కళాత్మకంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేయడం పట్ల సుధీర్‌ను బీసీ రాజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పురాతన నాణేలతోపాటు సహజత్వం ఉట్టిపడేలా కొండపల్లి బొమ్మలు, రాజస్థాన్ బొమ్మలు, దేవతమూర్తుల ప్రతిమలతో భారతదేశ సంస్కృ, సంప్రదాయాలు తెలియజేసేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. అలాగే సుధీర్ ఇంటి పెరట్లో ఏర్పాటుచేసిన పూలు, పండ్ల మొక్కలు అలాగే ఆకుకూరలు, కూరగాయాలను పెంచడాన్ని చూసి సుధీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కీ.శే.చెట్టుకింది శేషయ్య కుటుంబంతో తమ కుటుంబానికి గత 50సంవత్సరాలుగా అనుబంధం ఉందని బీసీ రాజారెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నుసి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ భువనేశ్వరి దేవిగా శ్రీశ్రీశ్రీ కాళిమాత

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆళ్లగడ్డ విశ్వరూపనగర్‌లోని శ్రీశ్రీశ్రీ కాళీకామాత ఆలయంలో అమ్మవారు శ్రీభువనేశ్వరి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్రచారి మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చ ంద్రశేఖర్ ఆచారి ఉదయం సుప్రభాతం అభిషేకం చేశారు. అనంతరం దురగడ్డ రవీంద్రచారి ధర్మపత్ని సావిత్రి దురగడ్డ శేఖర్ ఆచారి ధర్మపత్ని పవిత్ర నందికుంట సాయన్నఆచారి ధర్మపత్ని సుబ్బమ్మ నందికుంట శివబ్రహ్మాచారి ధర్మపత్ని హరిణిలు ఉభయదారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీభువనేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వబుగ్గ కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌పై కోటీరూపాయలకు పైగా అవినీతి ఆరోపణలు

**కర్నూలు విద్య, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బుగ్గ రామేశ్వరస్వామి దేవాలయం కాల్వబుగ్గ కర్నూలు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కోటి 20 లక్షల రూపాయలకు పైగా అవినీతి చేసినట్టుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రావడం చాల బాధకరం. అవినీతి జరిగింది వాస్తవమే అయితే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటూ క్రిమినల్‌కేసుల్ని పెట్టి చట్టపరంగా తగిన విధంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ వారు కోరారు. సొమ్మునంతా కూడ రికవరీ చేసి సదరు దేవస్థానానికి అప్పచెప్పాల్సిందిగా కోరుతున్నాం. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని విశ్వహిందూ పరిషత్ కోరుతున్నది ఒకటే దేవస్థానాల్లో అవినీతిమయమైన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని వేసేలాగ ప్రయత్నం చేయాలి. బీనామి పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న అన్యమతస్థులను తక్షణమే ఖాళీ చేయించాలి. ఉదాహరణకు మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో పూల విక్రయదారుడు మరియు నందవరం క్షేత్రంలో కూలింగ్‌డ్రిక్స్ విక్రయదారులు, యాగంగి క్షేత్రంలో బొమ్మలు తదితర వస్తువులు అన్యమతస్థులు అమ్ముతున్నట్లుగా మనకు సమాచారం ఉంది. ఈవిషయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తీసుకొని వారిని ఖాళీ చేయించాలి. అప్పుడైతేనే ఈప్రభుత్వం హిందూ మనోభావాలు అనుగుణంగా ఉందని మేం భావిస్తున్నాం. లేనిపక్షంలో ఉద్యమ కార్యచరణకు సిద్దమవుతామని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో ఇలాంటి అవినీతి అధికారులను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## మహాలక్ష్మీదేవి అలంకారంలో శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారు

**-మహాలక్ష్మీదేవి అలంకారంలో శ్రీ భువనగాయత్రి మాత**

**వెల్దుర్తి, అక్టోబర్8,ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణంలోని అమ్మవారిశాలలో మంగళవారం శ్రీ వాసవికన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తలకు దర్శనమిచ్చారు.అపధర్మ అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు,ఆర్యవైశ్యులు,కమిటీ సభ్యులు శరన్నవరాత్రి మహోత్సవాలు వై.విశ్వనాథశర్మ అర్చకత్వమున నిర్వహిసు_న్నారు.ఈ కార్యక్రమంలో అపధర్మ అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు,తిరివీధి రాంప్రసాద్,వంశీధర్,తిరివీధి నారాయణ శెట్టి,తిరివీధి వెంకటరమేష్,సముద్రాల వెంకటేశ్వర్లు, అత్తులూరి సుబ్రహ్మణ్యం,అత్తులూరి సుధాకర్, టి.వి.కిషోర్,సముద్రాల సురేష్‌బాబు, తిరివీధి వెంకట సుధీంద్ర,ఎ.క్రిష్ణకిరణ్(ఏపి ఆర్యవైశ్య మహాసభయువజనసంఘం జనరల్ సెక్రటరీ), వెల్దుర్తి ఆర్యవైశ్యసంఘం కార్యవర్గ సభ్యులు ఒంగోలు సాయిప్రసాద్, ఎ.కళ్యాణ్,ఎన్.వి.ఎస్.నూకల వెంకటేష్,ఐడియా శివ,సంపత్, శ్రీధర్,కొ్రటాకాంత్, గోల్డ్‌శేషు, సంతోష్,అమ్మవారిశాల శీను,భువన గాయత్రి శక్తిపీఠం ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు జూలకంటి రఘునాథ్‌రెడ్డి,లక్ష్మీసరోజ,రాము ఆచారి, జగదీష్, రమణాచారి, హరిసింహానాయుడు, రమణాచలం, హరినాథ్,ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## నిధుల ధుర్వినియోగంపై వైద్యరాలిపై కమిటీ విచారణ

**చాగలమర్రి,అక్టోబర్ 8,ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో విధుల నిర్వహిస్తున్న డాక్టర్. అంజలిపై నిధుల ధుర్వినియోగంపై హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.పి.పి.వీరభద్రుడు,జిల్లా కలెక్టర్, డి.ఎం.హెచ్.ఓ.కు ఫిర్యాదు చేయడంపైన కలెక్టర్ ఆదేశాలపై నలుగురు కమిటీతో కూడిన సభ్యులు అడిషినల్ డి.ఎం.హెచ్.ఓ. శారదాబాయి డిస్టిక్ ఇమేజెస్ అధికారి ప్రసన్నలక్ష్మి మరనో ఇద్దరితో కూడిన కమిటీ మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చైర్మన్ అనుమతి లేకుండా సొంత నిర్ణయాలతో బ్యాంక్ నుండి రూ.45 వేలు 2023లో హాస్పటల్ ప్రాంగణంలోని సుమారు లక్షకు పైబడి చెట్లను అమ్ముకోవడం జరిగిందని సక్రమంగా హాజరు కాకపోవడంపై చైర్మన్‌ను కూడా లెక్క చేయకుండా తన సొంత నిర్ణయాలతో ముందుకు వెళుతుండడంపై ఎం.పి.పి.కలెక్టర్‌కు, డి.యం.హెచ్.ఓ,.ఫిర్యాదు చేశారన్నారు. అలాగే 11. 2022 నుండి 2023 మధ్య కాలంలో బెనిఫిషర్‌ది 4వేలు అమౌంట్ డ్రా చేసుకోవడం జరిగిందన్నారు.కలెక్టర్, డి.ఎం.హెచ్.ఓ. ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో విచారణ చేపట్టారు. విచారణ నివేదిక డిఎంహెచ్ ద్వారా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.బి.ఎస్.అధికారి శివలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎంఎన్‌ఓ పి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి

**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంఎన్‌ఓగా విధులు నిర్వహిస్తున్న పి శ్రీనివాసులు కొన్నిరోజుల నుండి అనారోగ్యంతో ఏఎంసి వార్డులో అడ్మిషన్ ఉండగా మంగళవారం ఉదయం చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం తరుపున మట్టిఖర్చులకు రావాల్సిన పైకం రూ.25 వేలు వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ బాలు నాయక్ శాఖ ట్రెజరర్ కె సురేష్ మరియు యూనియన్ నాయకులు డి సుందర్‌రాజు, ఎస్ ఉరుకుందయ్య, యు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి 6వ రోజు అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో

**నందవరం, అక్టోబర్8, ప్రభాతవార్త:** దుర్గాదేవి శక్తి స్వరూపిణి నవరాత్రుల 9 రోజులు అమ్మవారిని భక్తులు ఒక్కొక్క రోజు ఒక్కోరూపంలో అలంకరిస్తారు. దేవి నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం టి చామలగూడూరు గ్రామంలో గ్రామదేవత శ్రీపెద్దమ్మ తల్లి మహాలక్ష్మీదేవిగా అలంకరించి ఈసందర్భంగా గ్రామ పురోహితులు శ్రీదర్ స్వామి మాట్లాడుతూ సంపద శ్రేయస్సును కోరుతూ పెద్దమ్మ తల్లిని అరాధిస్తారు. భక్తులు అమ్మవారు శ్రీలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు కనువిందు చేస్తారు.భక్తులు నవరాత్రి 6వ రోజున శ్రీమహాలక్ష్మీదేవిని పూజిస్తారు. ఆరోజు ఆమెకు గులాబి రంగు చీరెతో అలంకరిస్తారు. అమ్మవారిని నైవేద్యంగా పాలు పంచదారలతో చేసిన క్షీరాన్నం సమర్పిస్తారు. ఇంతటి మహోన్నతమైన ఆలయ పూజారి తిరుమల రెడ్డి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెల్లవారుజాము నుంచి సందడి చేయనున్నారు.

## పంటసాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

**కొత్తపల్లి, అక్టోబర్ 8, ప్రభాతవార్త:**

రైతులు పంట వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఆంజనేయ రైతులకు సూచించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని దుద్యాల కొక్కెరంచ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆద్వర ్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట కోత అనంతరం పొలంలో పంట కొయ్యలను కాల్చరాదని అలా చేస్తే భూమిలో సూక్ష్మజీవులు నశించి భూమి మొక్కసారం తగ్గుతుందన్నారు. రైతులు విత్తనం వేసే ముందు విత్తశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రతి పంటకు రక్షక పంట వేసుకోవడం వల్ల గాలి ద్వారా వచ్చే వైరస్ తెగుళ్ళకు అడ్డుకట్ట వేయవచ ్చన్నారు. అనంతరం ఉద్యానవనశాఖాధికారి చందన మాట్లాడుతూ రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు, అందుబాటులో ఉన్నాయి వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కొక్కెరంచ గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమశాఖాధికారి లింగమూర్తి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఆశోక్, శేషు, పల్లవి, బాలు మరియు రైతులు పాల్గొన్నారు.

# పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



**నంద్యాల , 08 అక్టోబర్, ప్రభాతవార్త, ప్రతినిధి:** నంద్యాల జిల్లాలోని అన్ని మున్సిపల్ ప్రాంతాలలో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్లో అన్న క్యాంటీన్లు, 200రోజుల ప్రణాళిక, ఎస్టీపీ ల్యాండ్, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, త్రాగునీటి సరఫరా, తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. పట్టణ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వందరోజుల ప్రణాళికలో చేపట్టి పూర్తి చేసిన పనులన్నింటిని తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. అలాగే 200రోజుల ప్రణాళిక లక్ష్యాల నివేదికలను తనకు సమర్పించాలని కలెక్టర్ కమిషనర్లను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లను తరుచూ పర్యవేక్షించాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్లకు నిర్వహణకు సంబంధించి వార్తా పత్రికల్లో ప్రతికూల వార్తలు వస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. మురికినీటి శుది ప్లాంట్‌లకు అవసరమయ్యే స్థలాలకు నంద్యాలలో 3ఎకరాలు, ఆళ్లగడ్డలో 2.8, ఆత్మకూరులో 3, నందికొట్కూరులో 3.4, డోన్‌లో 7.5ఎకరాల స్థల సేకరణ కొరకు సంబంధింత ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని వారం రోజుల్లో సంబంధిత ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు మున్సిపాల్టీలలో అందుబాటులో ఉన్న నిధులతో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డోన్ మున్సిపాల్టీలో అమృత్ సరోవర్ కింద ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే 20సెంట్ల స్థలాన్ని కూడా సంబంధిత ఆర్డీఓతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని డోన్ మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల పట్టణంలో బయోగ్యాస్‌కు అవసరమైన 5ఎకరాల స్థలాన్ని గుర్తించాలని నంద్యాల ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కమిషనర్లకు సూచించారు. నంద్యాల పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. అన్ని మున్సిపాల్టీల్లోని పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని తలపించేలా గ్రీనరీని పెంచడంతో పాటు ఆకర్షణీయమైన రీతిలో రోడ్డులకు ఇరువైపులా రంగులతో దిద్దిన చిత్రాలను వేయడంతో పాటు డివైడర్ల మధ్యలో గ్రీనరీని పెంచాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

## తుంగభద్ర నదిలో గల్లంతైన భక్తుడు

:-గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

**మంత్రాలయం, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంవద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఓ భక్తుడుప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు పుట్టీలసహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం, చిక్కబళ్ళాపూర్ జిల్లా, ద్వారగణహళ్ళి గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప(41) అనే భక్తుడు శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం విచ్చేశారు. ఒకసారి తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తుడు మరోమారు పుణ్యస్నానాలు ఆచరించడానికి గంగమ్మగుడి వద్ద ప్రవహిస్తున్న నదిలోకి వెళ్ళాడు. అయితే ప్రమాదవశాత్తు కాలుజారి నదిలోకి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న మంత్రాలయం హెడ్‌కానిస్టేబుల్ రాఘవేంద్ర, రంగస్వామి, దశరథ రాముడులు నదిలో పుట్టీలతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సాయంత్రం వరకు వెదికినా భక్తుడి ఆచూకీ తెలియలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం పోలీసులు తెలిపారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ నుండి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎన్నికైన క్రీడాకారులు డి ఎస్ ఎన్ విశ్వనాథ్, పి నరసింహ, పి ఓబులేసులను మంగళవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ తమ కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ నుండి మరెంతో మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించేవిధంగా శిక్షణ ఇవ్వాలని కోచ్‌లకు సూచించారు. క్రీడల అభివృద్ధి కొరకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తాము అందిస్తామని ఆమె తెలిపారు. ఈకార్య క్రమంలో కోచ్ సుబ్బరాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కల్లపారిలో పొలం పిలుస్తోంది

– కంది పంటలను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్

కోడుమూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త : కోడుమూరు మండలం కల్లపారి గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారి రవిప్రకాష్ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య హజరయ్యారు. గ్రామానికి చెందిన పలువురి రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రైతులతో పంటల సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. అంతే గాక పంటల నమోదు చేసుకున్నారా లేదా అనే విషయాలను కూడా రైతులతో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు అందించే ప్రయోజకరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబి సీజన్‌లో సాగు చేసుకునే రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను అందిస్తోందని, రైతులకు విత్తన కొరత లేకుండా చూస్తామన్నారు. ఈ పంటల పరిశీలనలో కోడుమూరు తాహశీల్దార్ వెంకటేష్ నాయక్, విఆర్వోలు ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

–నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

**పాములపాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** రైతులకు సంబంధించిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రెవిన్యూ అధికారులకు అదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ ప్రజల నుంచి సీ ్వకరించిన సమస ్యలను సమగ్రంగా పరిశీలించి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. మండలంలోని వేంపెంట, భానుముక్కల, చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల్లో భారీవర్షాల వల్ల పంట నష్టపరిహారం రైతులకు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో రైతుల భూములు ప్రభుత్వ భూములుగా, చుక్కల భూములుగా అన్‌లైన్‌లో నమోదు అయ్యాయని ఈ సమస్యను పరిష్కరించాలని చెలిమిల్ల గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి, రైతులు కోరారు. పాములపాడు, మిట్టకందాల గ్రామాల్లో నీటి కుంటలు, చెరువులు, స్మశానవాటికలు, వక్ ్ఫభూములు, కెసి కెనాల్ పరివాహక భూములు కబ్జాలకు గురయ్యాయని వీటిని పరిరక్షించాలని విన్నవించారు. అయా గ్రామాల్లోని రైతులు, ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ పటాన్ బాబు, ఎంపీడిఓ చంద్రశేఖర్, ఎంఈఓ బాలాజీ నాయక్, వ్యవసాయ అధికారి ఫణీశ్వర్‌రెడ్డి, పశువైద్యాధికారి అనిల్, కొత్తపల్లి ఎస్ఐ కేశవ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీలు ఎన్నిక

– బీసీల అభివృద్ధికి కృషి చేస్తాం

**ఆదోనిలీగల్, అక్టోబర్08, ప్రభాతవార్త;** ఆదోని డివిజన్ పరిధిలో బీసీ ఫెడరేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, రాష్ట్ర అధ్యక్షులు దేవ పూజ ధనుంజయ ఆచారి, జిల్లా అధ ్యక్షులు తౌడు శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షులు సాయిబాబా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర ఆచారి పాల్గొన్నారు. నూతన కమిటీ కార్యవర్గ ఎంపిక సభలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌పార్థ సారథి, దేవపూజ ధనుంజయ్య ఆచారి సమక్షంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 55 శతం ఉన్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రతి బీసీ కులానికి చెందిన రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. మనం అడుక్కునే పరిస్థితిలో ఉన్నాం, మనం శాసించే స్థాయికి ఎదగాలన్నారు. మన ఆదోని అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏదైనా బీసీ కులాల వారికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదోనిలో బీసీ భవనం నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు. దేవపూజ ధనుంజయ్య మాట్లాడుతూ కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులాల వారికి సమగ్ర కుల గణన చేసి ఏ కులం ఎంతో మా కులాలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఆదోని డివిజన్ నాయకులు పి.ఫక్రుద్దీన్, మాన్వి దేవేంద్రప్ప, ధణాపురం శేషన్న, పి.షేక్షావలి, బండారి రాజేశ్వరరావు, ఉరుకుంద (అడ్వకేట్), ఆలూరు తాలూకా అధ్యక్షులు తిక్కయ్య, మంత్రాలయం అధ్యక్షులు డి.రఘు రామ్, కౌతాళం అధ్యక్షులు వీరేష్ , కోసగి మండలాధ్యక్షులు భాను ప్రకాష్, ఆదోని తాలూకా అధ్యక్షులు మరియాని చెన్నబసప్ప, సభ్యులు, ఆదోని పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లల్లో లక్ష్యాలను అధిగమించాలి

**కర్నూలు మున్సిపల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** నగరపాలకకు చెల్లించాల్సిన పన్ను వసూళ్ళల్లో నిరే ్ధశించిన లక్ష్యాలను అధిగమించాలని నగరపాలక కార్యాలయ మేనేజర్ ఎన్ చిన్నరాముడు, సచివాలయ అడ్మిన్‌లను అదేశించారు. మంగళవారం ఇందిరాగాంధీనగర్ 111వ సచివాలయంలో 29 సచివాలయ అడ్మిన్‌లతో మేనేజర్ ఆర్ఐ నాగరాజు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పన్ను వసూళ్ళల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రతే ్యక కార్యచరణ రూపొందించుకొని బకాయిలను వసూలు చేయాలని అదేశించారు. సుదీర్ఘకాలం పాటు పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీచేయాలని సూచించారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

– ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**గడివేముల, అక్టోబర్08, ప్రభాతవార్త;** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్నిశాకల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కార్యాలయానికి చేరుకుని బాధితుల నుంచి వ్యక్తిగత, సామూహికంగా ఉన్న సమస్యలను దరకాస్తుల ద్వారా స్వీకరించారు. దరఖాస్తులను అధికారికంగా నమోదు చేసిఎమ్మెల్యే ద్వారా వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల చేత పరిష్కార మార్గాలను బాధితులకు వివరించేవిధగా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గడివేముల మండల పరిషత్ కార్యాలయంలో మొట్టమొదటిసారిగా ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం పెసరవాయి గ్రామానికి చెందిన మూడు పొదుపు సంఘాలకు శ్రీ నిధి నిధుల నుంచి రూ.24 లక్షలు చెక్కును ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, డిప్యూటీ తహసీల్దార్ రవిప్రసాద్, పంచాయతీరాజ్ అధికారి భాస్కర్, గడివేముల సర్పంచ్ రవణమ్మ, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, టీడీపీ నాయకులు కృష్ణ యాదవ్, శ్రీనివాసయాదవ్, రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మురళీమోహనర్రెడ్డి, హర్షవర్ధన , సుభద్రమ్మ, ఒడ్డులక్ష్మిదేవి, ప్రశాంతి, ఎస్‌పి రఫీక , సుదర్శన్‌రెడ్డి, జయ్ప్రకాష్‌రెడ్డి, భోదనం భాస్కర్‌యాదవ్, మండలంలోని టీడీపీ నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న కమీషనర్

**నందికొట్కూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** దసరా పండుగ మహోత్సవాల సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీశ్రీశ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవిని పట్టణ మున్సిపల్ కమీషనర్ ఎస్.బేబి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయక కమిటి సభ్యులు మర్యాద పూర్వకంగా కమీషనర్‌ను ఆహ్వానించి పూజ అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బచ్చు శ్రీనువాసులు, సుబ్బారావు, కల్కి శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు 76 దరఖాస్తులు

**నందికొట్కూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** నందికొట్కూరు తాలుకా పరిధిలో ప్రభుత్వం కేటాయించిన 10 మద్యం దుకాణాలకు 76 మద్యం షాపులకు దరఖాస్తులు వచ్చినట్లుగా ఎక్సైజ్ శాఖ సి.ఐ. రామాంజనేయులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు నందికొట్కూరు పట్టణం మరియు రూరల్ దుకాణాలకు 39, పగిడ్యాల దుకాణం 2, జూపాడుబంగ్లా దుకాణానికి 25 దరఖాస్తులు, మిడుతూరు మండలానికి 2 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి 9వ తేదీ ఆఖరు అని సి.ఐ. తెలిపారు.

## ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన జనసేన ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప

**ఆలూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ హరిప్రసాద్(డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధ్యక్షులు వారి రాజకీయ కార్యదర్శి)ని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప మంగళవారం కలిసి ఆలూరు నియోజకవర్గ ఎన్‌డిఏ కూటమిపై లోతైన చర్చలు జరిపారు. ఈ సమావేశంలో కూటమి భవిష్యత్తు దిశను ప్రభావితం చేసే ముఖ్యమైన అంశాలపై చర్చించారు. జనసేన, ఎన్‌డిఏ మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేసే మార్గాలను అన్వేషించారు. ఆలూరు నియోజకవర్గ తెదేపా నాయకుల సహకారాలు గురించి రిపోర్టు రాసి ఇవ్వాలని త్వరలోనే డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళి సమావేశమై లోపాలు ఉంటే సరిదిద్దుకొని పరస్పరం సహకరించుకునే విధంగా ముందుకెళ్లాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచించినట్లు జనసేన ఇంచార్జ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. రాజకీయ సవాళ్లను అధిగమించడం, పరస్పర సహకారాన్ని పెంపొందించడం, రాష్ట్రవ్యాప్తంగా మంచి పరిపాలన మరియు అభివృద్ధి కోసం పరస్పర లక్ష్యాలను సాధించడంపై స్ట్రాటజీలపై చర్చలు జరిగాయన్నారు. ఎన్‌డిఏ కూటమి పరిపాలన విధానాలు ప్రజల అంచనాలను నెరవేర్చడంలో ముఖ్యంగా ప్రాంతీయ సమస్యలను పరిష్కరించడంలో మరియు కీలక రంగాలలో అభివృద్ధిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించడానికి తగిన ప్రయత్నాలు చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశం జనసేన పార్టీ ఎన్‌డిఏ కూటమిలో కీలకపాత్ర పోషించాలని, ఏపి రాజకీయ భవిష్యత్తుకు స్థిరత్వం మరియు అభివృద్ధి తీసుకురావడంలో సహకరించాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచించారు.

## టీబీ కుష్టు వ్యాధి కేసులపై సర్వే చేయాలి

**చాగలమర్రి, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** టిబీ కుష్టు వ్యాధిపై ఖచ్చితమైన సర్వే నిర్వహించి కేసులను తొందరగా గుర్తించాలని అడిషినల్ డి.యం.హెచ్.ఓ. శారదాబాయి, వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం స్తానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశ డే సంధర్భంగా వైద్య సిబ్బందికి ఆశా వర్కర్లకు, ఎ.ఎన్.ఎం.లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు కుష్టు వ్యాధి, టీబీ లపై ప్రత్యేక శ్రద్ద వహించి సర్వేలను పూర్తి చేసి వారికి తగు వైద్యం అంధించాలన్నారు. ప్రతి టీబీ కేసుపై క్రమం తప్పకుండా అనుసరించి మందులను వాడే విధంగా చూడాలన్నారు. 19 ఏళ్ళ నుండి 60 ఏళ్ళ పైబడిన వారందరికి బీసీజీ వ్యాక్సిన్ చేయాలన్నారు. పుట్టిన బిడ్డ నుండి 16 సంవత్సరాల వరకు వ్యాధి నిరోధక టీకాలను అంధించాలన్నారు. ఈ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. సీజినల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎం.పి.హెచ్.ఓ,. జగదీశ్వరప్ప, సి.హెచ్.ఓ.రమణమ్మ, వెంకటమ్మ, ఆశ, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**గడివేముల, అక్టోబర్08, ప్రభాతవార్త;** తడిసిన సోయాబీన్ విత్తనాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నంద్యాల జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. గడివేముల మండలలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో గత నాలుగు రోజుల క్రితం అకాల వర్షాలతో కల్లాలు ఆరబోసుకున్న తడిచిన సోయాబీన్ మొక్కజొన్న విత్తనాలను మంగళవారంనాడు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన రైతులకు రేపు రబీ పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పంట కోయని విత్తనాలను కూడా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో విషయంపై కలెక్టర్, అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజశేఖర్, మద్దిలేటి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెగుళ్ళపై రైతులకు అవగాహన

**చాగలమర్రి, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** మండలంలోని మల్లెవేముల, చాగలమర్రి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి రంగనేతాజి మాట్లాడుతు వరి, మొక్కజొన్న, మినుము పంటలలో ఆశించు పురుగులు మరియు తెగుళ్ళ నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. తప్పకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, రసాయన ఎరువులు మరియు పురుగు మందులు మాత్రమే ఉపయోగించడం వలన పెట్టుబడి అధిక మవుతుందన్నారు. నేల ఆరోగ్యం పాడవుతుందని జీవన ఉరువుల వాడకం విత్తన శుద్ధి వంటి వాటితో తక్కువ పెట్టుబగడితో మంచి లాభాలను ఆశించవచ్చునన్నారు. పశు వైద్యాధికారి సాయిబాబ మాట్లాడుతు పశువులకు నట్టల మందు తప్పక వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.ఈ.ఓ.లు ఇతర వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## అధిక దిగుబడులు సాధించాలి

**కౌతాళం, అక్టోబర్08, ప్రభాతవార్త;** రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రమైన కౌతాళంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల పత్తి, మిరప పంటల్లో తెగుళ్లు, వాటి సస్యరక్షణ చర్యలపై రైతులతో చర్చించారు. రైతులకు అందుబాటులో గ్రామస్థాయిలో వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది ఉంటారన్నారు. రైతులకు పంటల సాగులో మెళుకువలు తెలియజేసి, సకాలంలో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అందించేలా కృషి చేస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌతాళం తహసీల్దార్, హార్టికల్చర్ ఆఫీసర్ హరేంద్ర,, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ హెల్పర్స్‌పోష్టులకు దరఖాస్తులు చేసుకోండి

**నందికొట్కూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ఐ.సి.డి.యస్.ప్రాజెక్టు నందికొట్కూరు పరిధిలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు మండలాలలో ఎనిమిది ఖాళీగా ఉన్న ఎనిమిది అంగన్వాడీ హెల్పర్ (ఆయా) పోష్టుల నియామకానికై అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని సి.డి.పి.ఓ. కోటేశ్వరి తెలిపారు. నందికొట్కూరు మండలం బొల్లవరం -1 (ఓసి) బిజినవేముల-1(ఎస్సీ), నందికొట్కూరు-30 వ కేంద్రంలో 1(ఎస్సీ), జూపాడుబంగ్లా మండలంలో పి.లింగాపురం -1(బిసి.బి ), పగిడ్యాల మండలం ప్రాతకోట -4లో 1(బిసి.సి), లక్ష్మాపురం -1(బిసి.డి), మిడుతూరు మండలం సున్నంపల్లి -1(ఈడబ్ల్యూఎస్), పాములపాడు మండలం శాంతినిలయం -1(ఓసి) అభ్యర్థి తప్పని సరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, 01.07.2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ళలోపు వారై ఉండాలి, వివాహితురాలై ఉండాలి, స్తానిక నివాసితురాలై ఉండాలి, ఎస్సీ ఎస్టీ జనావాస ప్రాంతాలలో అభ్యర్థినిలలో 21 సంవత్సరాలు నిండని వారు లేనిచో 18 ఏళ్ళు నిండిన వారిని పరిగణంలోకి తీసుకొనబడునని సిడిపిఓ తెలిపారు. నందికొట్కూరు 30వ సెంటర్‌కు 3వ రెవెన్యూ వార్డుకు సంభంధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసు కోవాలన్నారు. జతపరచ వలసిన సర్టిఫికెట్లు పుట్టిన తేదీ, కుల దృవీకరణ, నివాస స్థల దృవీకరణ, వికలాంగులు, వితంతువులు అయితే దృవీకరణ పత్రాలు, 10వ తరగతి మార్కులిస్టు, ఆధార్, రేషన్ కార్డు జతపరచాలని ఆమె తెలిపారు. 10.10.2024 నుండి 21.10.2024 సాయంత్రం అయిదు గంటలలోపు కార్యాలయం పని దినాలలో సమర్పించాలని సి.డి.పి.ఓ. తెలిపారు. ఈ నోటిఫికేషన్ ను ఏ సమయంలోనైనా రద్దు చేయు అధికారం ఈ క్రింది సంతకం దారులలకు కలదని ఆమె తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాలను శక్తివంతం చేయడమే లక్ష్యం..!

ఆలూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాలను శక్తివంతం చేయడమే జనసేన పార్టీ లక్ష్యమని ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప అన్నారు. మంగళవారం ఆలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో కీలక మౌలిక సదుపాయాలపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి డైరెక్టర్ కృష్ణతేజ ఐఏఎస్‌ను కలిసి చర్చించారు. ముఖ్యంగా సిసిరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, బిటి రోడ్డు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి అత్యవసర అవసరాలు, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్థిరమైన అభివృద్ధికి ఈ సదుపాయాలు కీలకంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎన్ఆర్ఈజిఎస్ నిధులను జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి అనే అంశాలు చర్చకు వచ్చాయి. తెర్నేకల్ వెంకప్ప మాట్లాడుతూ గ్రామాలు దేశానికి వెన్నముక వంటివని వాటి అభివృద్ధి భారతదేశ పురోగతిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ మౌలిక సదుపాయాల సమస్యలను వ్యవస్థాపకంగా పరిష్కరించడం ద్వారా స్వయం సమృద్ధి కలిగిన గ్రామాలను నిర్మించడం సాధ్యమవుతుందన్నారు. తద్వారా దేశం మొత్తం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలను శక్తివంతం చేయడం, అభివృద్ధి మార్గంలో ఏ గ్రామం వెనుకబడకూడదనేదే జనసేన పార్టీ లక్ష్యమని తెలియజేశారు.

## 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని, అక్టోబరు 8, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ నెల 10న మంత్రి మండలి సమావేశంలో 12వ పిఆర్‌సి అమలు ఆలస్యమవుతున్నందున నిత్యావసర ధరలకు అనుగుణంగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కమిటీ కన్వినర్ జి వీరచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల మధ్యంతర భృతిపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ నెల 10వ తేదీన జరిగే మంత్రి మండలి సమావేశంలో దసరా కానుకగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.20వేల కోట్ల బకాయిలైన డిఏ, ప్రావిడెంట్ ఫండ్, ఏపిజీఎల్, సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## సోయాచిక్కుడు పంటపై క్షేత్రదినోత్సవం

**నందికొట్కూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె ఆధ్వర్యంలో శాతనకోట గ్రామంలో సోయాచిక్కుడు పంటపై క్షేత్రదినోత్సవం నిర్వహించి వారి శాస్త్రీయ పద్ధతుల ద్వారా పండించిన పంట యొక్క దిగుబడులపై అవగామాన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇంచార్జ్ రమణయ్య మాట్లాడుతు జాతీయ నూనెగింజల ఆదర్శ గ్రామం అనే కార్యక్రమంలో శాతనకోట ఎంపిక చేసి 250 ఎకరాల్లో వర్షదార కింద సోయా చిక్కుడు బాసరా రకం పంటను సాగు చేయించామని ఆయన తెలిపారు. వర్షదారా పంటల్లో నూతన వ్యవసాయ విధానాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని, నూనెగింజల సాగుఐ రైతులు దృష్టిసారించి నూనెగింజల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించడానికి రైతులు సహాకరించాలని ఏడిఏ విజయశేఖర్ తెలిపారు. ఎత్తుబెడ్లలో సొయాచిక్కుడు సాగు చేయడం వల్ల అధిక వర్షం కురిసినపుడు నీరు బయటికిపారడానికి అలాగే నీరు ఇంకి బెట్ట ఎదురైనపుడు పొలం నీటి ఎద్దడినిన అధికమించగలమని రైతు జలీల్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి.షేక్‌షావలి, కేవికే శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడ్, డి.ఆర్.సి.ఏ.ఓ.హేమలత, వీఏఏ విజయ్, రైతులు పాల్గొన్నారు.

## పందికోనలో ఉచిత వైద్య శిబిరం

పత్తికొండ, అక్టోబరు 8, ప్రభాతవార్త

మండల పరిధిలోని పందికోన గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ మంజుల సహకారంతో నిర్వహించారు. హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు సుఖవ్యాధుల పట్ల మరియు రక్త పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 104మెడికల్ ఆఫీసర్ డా.ఎన్ కార్తీక్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల వలస కూలీలు, హామాలీ వర్కర్స్, యువతకు అవగాహన ఉండడం వల్ల హెచ్ఐవికి గురికాకుండ చూసుకోవచ్చని, చికిత ్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. జోనల్ సూపర్‌వైజర్ రామాంజనేయులు మాట్లాడుతూ హెచ్ఐవి కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్ఐవి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలో 100గ్రామాల్లో అవగాహన సదస్సులు మరియు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఎం శివరాముడు, సిహెచ్ఓ సోఫియా, ఏఎన్ఎం నాగరత్నమ్మ, ఆశాలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

దేవనకొండ, అక్టోబరు 8, ప్రభాతవార్త

మండల కేంద్రమైన దేవనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం నందు మంగళవారం శాంతిరామ్ మెడికల్ జనరల్ వైద్యశాల వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని టిడిపి మండల కన్వినర్ విజయభాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు ఉచితంగా ఈసిజి, హార్ట్ చెకప్ మరియు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అప్టోమెట్రిస్ట్ క్యాంప్ ఇంచార్జ ఆది మాట్లాడుతూ పేదప్రజలకు సేవ చేయుటకు ఈ శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందని 102మందికి వివిధ పరీక్షలు చేసి కంటి చూపు లేని వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి కంటి అద్దాలు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉచ్చీరప్ప, టిడిపి మండల నాయకులు ఆకుల వీరేష్, బండ్లయ్య, మలకన్న, మల్లికార్జునగౌడ్, వెంకటస్వామిగౌడ్, రాజాసాహెబ్, నాగరాజుగౌడ్, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈపంట నమోదు తప్పనిసరి..

:- తహశీల్దార్ శ్రీనాథ్, ఏఓ వరప్రసాద్

**పెద్దకడుబూరు, అక్టోబరు 8, ప్రభాతవార్త :** మండలంలో వివిధ గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పంటను ఈపంటలో నమోదు చేసుకోవాలని అలా చేసుకున్న రైతులకే పథకాలు అందుతాయని, ఈ నెల 9వ తేదీలోపు ప్రతి రైతు ఆర్‌బికె కేంద్రాలకు వెళ్లి ఈకెవైసి చేయించుకోవాలని మండల తహశీల్దార్ శ్రీనాథ్, వ్యవసాయ అధికారి వరప్రసాద్‌లు రైతులను కోరారు. 2024 ఖరీఫ్ పంటలకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది మరియు విఆర్‌ఓలు సంయుక్తంగా పంటనమోదు చేయడం జరుగుతుందని మంగళవారం పంటనమోదు కార్యక్రమాన్ని మండల ప్రజలు నౌలకల్, పెద్దకడుబూరు గ్రామాల్లో తహశీల్దార్ శ్రీనాథ్, వ్యవసాయాధికారి వరప్రసాద్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేశారు. పంట నమోదులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పంటనమోదు కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. మరీముఖ్యంగా మండలంలో ఇప్పటికే 96శాతం ఈకెవైసి పూర్తయిందని మిగిలిన రైతులు కూడా ఈ నెల 9వ తేదీలోపు ఈకెవైసి చేయించుకోవాలని సూచించారు. అలాగే శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందితో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని శనగ పూర్తి ధర క్వింటం రూ.9400లు ఉండగా 25శాతం సబ్సీడీ పోను రూ.7050లు రైతులు చెల్లించాలని ఏఓ కోరారు. ఈ కార్యక్రమంలో నౌలకల్, పెద్దకడుబూరు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చక్రాల గ్రామంలో పొలం పిలుస్తుంది..!

పత్తికొండ, అక్టోబరు 8, ప్రభాతవార్త

మండలంలోని చక్రాల గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి రియాజ్‌భాషా, ఎంపిటిసి చక్రాల రాజుల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభం ఎలా పొందవచ్చు అనేదానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇస్తుందని రైతులు సారవంతమైన భూమిని బట్టి విత్తనాలు, ఎరువులు పంటపొలాలలో తగినంత వేయాలని సూచించారు. అధికారులను సంప్రదిస్తే పంట పొలాలను పరిశీలించి భూములలో ఏ పంట వేయాలి ఆ పంటకు ఎంత లాభం వస్తుందో అధికారులు రైతులకు తెలియజేశారు. ప్రతి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చుమర్రిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

పగిడ్యాల, అక్టోబరు 8, ప్రభాతవార్త

పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి, పాత ముచ్చుమర్రి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు చేపట్టారు. ముఖ్యఅతిధిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి జ్యోతికుమార్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకోత మార్పిడినందు తీసుకోవలసినజాగ్రత్తలను గురించి వివరించారు. ముఖ్యంగా మొక్కజొన్న పంట కొతకు వచ్చినపుడు కండెలపై పొరలు ఎండినట్లుగా వుండి మొక్కలపై క్రిందికివేలాడుతూ కనిపిస్తుందన్నారు. కండెలలోని గింజలను గోరుతో నొక్కినప్పుడు చాలా గట్టిగా ఉండి నొక్కులు ఏర్పడవన్నారు. ఈదశలో గింజలలో సుమారుగా 25-30 తేమ వుంటుందనీ గింజలను ఎండలో తేమశాతం 15శాతం, వచ్చేవరకు 3-4 రోజులు ఆరబెట్టుకోవాలన్నారు. ఆదేవిధంగా గింజలను ఆరబెట్టిన అనంతరం శుద్ధిచేసి గోనెసంచులలో కానీ పాలిథిన్ సంచులలో కానీ భద్రపరిచి చల్లని తక్కువ తేమ గల ప్రాంతాల్లో నిలువచేసుకోవాలన్నారు. దీనితో పాటు నిల్వలో తేమగానీ ,ఎలుకలు పురుగులు శిలింద్రాలు మొదలగునవి రాకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీయుకోవాలనీ అన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న నుండి ఆహార ఉత్పత్తులు, పశువులదాణా పారిశ్రామిత ఉత్పత్తులు లాంటి మూడు రకాల రైతులులాభపడవచ్చనీ మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెర్నేకల్‌లో డెంగ్యూ కేసు నమోదు

**దేవనకొండ, అక్టోబరు 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామ సచివాలయం-1పరిధిలో 13సం॥ల బాలుడికి డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదు కావడంతో స్థానిక మెడికల్ ఆఫీసర్లు అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు మంగళవారం గ్రామాన్ని సందర్శించి సర్పంచ్ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాముడుల ఆధ్వర్యంలో దోమల నివారణ కొరకు దోమల మందును పిచికారి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందని రెండు సచివాలయాల్లో వారం రోజుల పాటు మెడికల్ క్యాంపులను నిర్వహించాలని ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం సూచించారు. గతంలో వచ్చిన డెంగ్యూ కేసులు కూడా పరిశీలించారు. గ్రామప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. వాటర్ నిల్వ ఉన్న ప్రాంతాల్లో వారానికి ఒకసారి స్ప్రేయింగ్ చేయాలని అదేవిధంగా ఆయిల్ బాల్స్ వేయించాలని సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ రంగస్వామి, ఏఎన్ఎం, ఆశాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యత లేని జాతీయ రహదారి పనులు..!

**: ఆత్మకూరు నుంచి గుంటూరుకు 340సి నేషనల్ హైవే పనులు ఇంతేనా..!**
**: జాతీయ రహదారి విస్తరణ పనులలో జరిగే అవినీతిపై కన్నెత్తిచూడని అధికార యంత్రాంగం**







**ఆత్మకూరు, అక్టోబర్08, ప్రభాతవార్త:** కర్నూలు నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి పనులు గత సంవత్సరం నుంచి కొనసాగుతున్న విషయం అందరికి తెలిసిందే. ఈ పనులో నాణ్యత ఎంత అనేది అధికారులు గుర్తించలేక పోతున్నారనే విషయాని పలువురు విమర్శలు చేస్తున్నారు. తెలుగు గంగా బిలుకుతో నాణ్యత లేని జాతీయ రహదారి పనులను కొనసాగించడం ఎంత వరకు సహజం అంటున్నారు. ఆత్మకూరు నుంచి గుంటూరు వరకు వేసే నాలుగు లైన్ల జాతీయ విస్తరణ పనులో దాదాపు రూ.1200ల కోట్లతో ఈ పనులను ప్రారంభించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి తెలుగు గంగా బిలుకును టన్నుల కొద్ది రోడ్డుకు వాడడం విశేషం. భద్రత లేని జాతీయ రహదారి పనులు కొనసాగిస్తూ క్వాలిటి నాణ్యత లేకపోవడంపై పలువురు వాహనదారులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోన లోటారం, పైన పటారం అనే చందంగా నేషనల్ జాతీయ రహదారి విస్తిర్ణ పనులు కొనసాగించడంలో ఎవరి వాట ఎంత అనే విషయం తెలియాల్సి ఉంది. ఇప్పటికైన క్వాలిటి కంట్రోల్ అధికారులు నేషనల్ జాతీయ రహదారిపై జరుగుతున్న నాణ్యత పరిణామాల పనులను పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఇష్టారాజ్యంగా ఎవరి పనులు వారు కొనసాగించుకుంటూ వెళ్తూన్న క్రమంలో నాణ్యతకు తిలోతాలు కలుగుతున్నాయని చెప్పవచ్చు. రోడ్డు ప్రారంభం దశలోనే అకాల వర్షాలకు నాణ్యత పరిణామం ఎంత అనేది గమనించవచ్చు. మరో వైపు రోడ్డుపై బిట్ రోడ్డు వేసిన్నప్పటికి ఎర్రటి మట్టితో రహదారి విస్తీర్ణ పనులు కనిపించడం గమనార్హం. ఆత్మకూరు నుంచి బైర్లూటి సరిహద్దు వరకు వేస్తున్న జాతీయ రహదారి మరమ్మతుపనులపై ఇప్పటికైన నేషనల్ హైవే అధికారులు పర్యవేక్షణ కొనసాగించాల్సి ఉంది. లేకపోతే కాంట్రాక్టర్ కక్కుర్తి కాసుల కోసం కోట్లాది రూపాయాలు ప్రజా ధనం రోడ్డు పాలు కావడం తప్పదని పలువురు విమర్శిస్తున్నారు. ఏదిఏమైన్నప్పటికి రాష్ట్రంలో ఎన్డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కల్తీ లేకుండా నాణ్యత పరిణామాలతో పనులు కొనసాగాలనే ఇది వరకే కాంట్రాక్టరులకు ఘాట్‌గా హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శ్రీశైలం నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల పనులపై నాణ్యతపై అధికారులు దృష్టి సారిస్తారా లేక కాసుల కోసం కక్కుర్తి పడుతున్న కాంట్రాక్టర్లపై మొగ్గు చూపుతారా అనే విషయంపై వేచిచూద్దాం. నేషనల్ హైవే రహదారి విస్తీర్ణ పనులో జరుగుతున్న నాణ్యత, అవినీతి అక్రమాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

# ఆర్టీసి బస్టాండ్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ బస్టాండ్‌గా తీర్చిదిద్దుతాం



**-రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ భరత్**

కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 8, ప్రభాతవార్తః మంగళవారం స్థానిక కర్నూలు-1 డిపో గ్యారేజిలో రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను మరియు ఒక కొత్త అల్ట్రా డీలక్స్ బస్సులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ జెండా ఊపి ప్రారంభించి అనంతరం బస్సు నడిపారు. మంత్రి మాట్లాడుతూ మన కర్నూలు ఆర్టీసి బస్టాండ్‌కు గతంలో మంచిపేరు ఉండేదని మరలా గతంలోలాగనే రాష్ట్రంలో నంబర్ 1 ఆర్టీసి బస్టాండ్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. ఈరోజు మూడు ఆర్టీసి నూతన బస్సులను ప్రారంబించిన వాటిలో రెండు సూపర్ లగ్జరీ బస్సులు, కర్నూలు-బెంగుళూరు రూట్‌లో ఒక అల్ట్రా డీలక్స్ బస్సు, కర్నూలు-తిరుపతి రూట్‌ల నందు తిప్పడం కొరకు ఈబస్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో 10 నూతన బస్సులను ప్రారంభించుకున్నామని మొత్తం ఇప్పటి వరకు 13 నూతన బస్సులు మన ఆర్టీసి డిపోలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌కు ల్యాండ్ కూడ అందుబాటులో ఉంది కాబట్టి ఈప్రదేశంలో రాయలసీమలోనే మంచి కన్వెన్షన్ హాల్ ఉండేలా కన్వెన్షన్ హాల్ నిర్మించడానికి ప్రణాళికను తయారుచేయాలని ఆర్ఎంను అదేశించామన్నారు. మన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే ప్రభుత్వం మన ముఖ్యమ ంత్రి ఆలోచనలకు అనుగుణంగానే మన ఆర్టీసి బస్టాండ్‌ను కూడ అంచలంచలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, కర్నూలు-1 మేనేజర్ సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ ఉశేన్, కర్నూలు+1, కర్నూలు-2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజరు ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దినకూలిపై హత్యాయత్నం

**-పరిస్థితి విషయం**

**నంద్యాల, అక్టోబరు 8, ప్రభాతవార్తప్రతినిధి**

నంద్యాల పట్టణంలోని వైయస్‌నగరుకు చెందిన వెంకటరమణ అనే దిన కూలిపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నము చేశారు.వివరాలోకి వెళ్లితే వైయస్ నగరుకు చెందిన వెంకటరమణ మంగళవారం రాత్రి చామకాలువ వద్ద ఉండగా అతనిపై 5 మంది గుర్తులు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి వచ్చి రాడ్లతో దాడి చేశారు. చుట్టుపక్కల వారు ప్రతిఘటించడముతో దుండగులు అక్కడి నుంచి పరార్ అయ్యారు. స్థానికులు హుటాహుటిన వెంకటరమణను నంద్యాల ప్రభుత్వం అసుపత్రికి తరలించారు. మూడవ పట్టణ పోలీసులుకేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయి

**- గంజహళ్ళి గ్రామంలో పంటను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నవ్య**



**గోనెగండ్ల, అక్టోబరు,8, ప్రభాతవార్త**

పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందుతాయిని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు.మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్ళి గ్రామంలో పర్యటించారు.స్థానిక అధికారులు పంట నమోదు చేసిన తీరు సక్రమంగా చేశారా లేదా అని ఆమె పంట పొలాల దగ్గరకు వెళ్లి పరిశీలించారు.పత్తి,మిరప,ఉల్లి పంటలను నమోదు చేసిన రైతులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తాము సాగు చేసుకున్న పంటలను నమోదు చేసుకోవాలని,పంట నమోదు చేసుకున్న తరువాత ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఈకేవైసీకి అక్టోబరు 9వ తేది అఖరి రోజని ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రతి రైతు తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు. అలాగే పంట నమోదు చేసుకున్న వారికి పంట నష్టపరిహారం,జీరో శాతం వడ్డి,తదితర పథకాలు వర్తిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రి,ఏవో హేమలత ,తహశీల్దార్ కుమారస్వామి,ఆర్ఐ సుబ్బరెడ్డి,రైతు సేవా కేంద్రసిబ్బంది షఫి,చైతన్య,వీఆర్వో మల్లికార్జున పాల్గొన్నారు.

## ఎర్రవాగు బ్రిడ్జిలో సిమెంట్ లారీ బోల్తా



**కొలిమిగుండ్ల, అక్టోబర్8, ప్రభాతవార్త:**

కొలిమిగుండ్ల మండల పరిధిలోని కల్వటాల-కొలిమిగుండ్ల గ్రామాల మధ్యన ఉన్న ఎర్రవాగు బ్రిడ్జిలో సిమెంట్ లోడ్ లారీ మంగళవారం తెల్లవారుజామున బోల్తా పడింది. తాడిప్రతికి వెళ్తున్న సిమెంట్ లారీ అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొని వంకలో పడిపోయింది. డ్రైవర్ ప్రమాదం నుండి చాకచక్యంగా తప్పించుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ఆరోగ్యమే మహా భాగ్యం

**- సర్పంచ్ తమ్మిదల ఉషారాణి**



**మిడుతూరు, అక్టోబర్08, ప్రభాతవార్త;** మండలంలోని నాగలూటి గ్రామంలో అమీలియో ఆస్పత్రి సహకారంతో కురువ హుసేనప్ప, అచ్చమ్మల జ్ఞాపకార్థం న్యాయవాది ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షులు బలరామ్, మహేశ్వరి, వెంకటరమణ, వాసుదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచ్ తమ్మిదల ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యం బాగుంటే అంతకుమించిన సంపద ఏదీ లేదన్నారు. గ్రామీణ స్థాయిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎందుకంటే ఏవైనా సమస్యలు ఉన్నా ఈ వైద్యశిబిరాల ద్వారా బయటపడి మెరుగైన వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వైద్యశిబిరాలు ఎంతో వ్యయ ప్రయాసాలతో కూడుకున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తమ్మిదల ఉషారాణి, మాజీ సిగిల్ విండో చైర్మన్ తమ్మిదల తులసీరెడ్డి, తమ్మిదల చిన్న పుల్లారెడ్డి, ఉప మండలాధ్యడు ఎతుపాకుల నభిరసూల్, రాంభూపాల్‌రెడ్డి, జంబులయ్య, చిన్నా , రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి, టమోటా ధరలను నియంత్రించండి - మంత్రి టి.జి.భరత్

**కర్నూలు, అక్టోబర్ 8, ప్రభాతవార్త :**

జిల్లాలో ఉల్లి, టమోటా ధరలను నియంత్రణ లో ఉంచాలని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రివర్యులు టి. జి. భరత్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం ధరల నియంత్రణపై మంత్రి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తో కలిసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలికాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్,సబ్ కలెక్టర్, ఆర్ డి ఓ లు, మార్కెటింగ్ శాఖ ఏడి, తహసిల్దార్లు, మార్కెట్ యార్డ్ ల సెక్రటరీలు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు, పౌరసరఫరాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి, టమోటా ధరలు అసాధారణ రీతిలో పెరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా నియంత్రణలో ఉంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు.. ముఖ్యమంత్రి కూడా ధరలను నియంత్రణలో ఉంచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని గట్టిగా చెప్పారని మంత్రి పేర్కొన్నారు.. పండుగ సమయంలో కూరగాయల ధరలు అసాధారణ రీతిలో పెరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ధరలు పెరగకుండా ఉల్లి, టమోటా క్వాంటిటీ ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతు బజార్లు, మార్కెట్లు, మార్కెట్ యార్డులను సందర్శించి ధరలు నియంత్రణ లో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.. ప్రతిరోజు జిల్లాలో ధరల వివరాలకు సంబంధించిన నివేదికను తనకు పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు..జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి, టమోటా ధరల నియంత్రణ కు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు..ప్యాపిలి నుండి రోజూ 3 టన్నుల టమోటా ను తెప్పించడం జరుగుతోందని, రూ.40 నుండి రూ.45 ల లోపు టమోటా ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు..అలాగే ఉల్లి మార్కెట్ యార్డు లో తగినంత ఉందని, ఇతర జిల్లాలకు కూడా ఉల్లిని పంపడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు..ఉల్లి ధర కూడా రూ.36 లు ఉండేలా చర్యలను తీసుకుంటున్నామని, అలాగే వంట నూనెల ధరల నియంత్రణకు కూడా తగిన చర్యలను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతు బజార్లు, మార్కెట్లు, మార్కెట్ యార్డులను విజిట్ చేయాలని, ఎక్కడైనా అసాధారణ రీతిలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు అమ్మకాలు జరిపితే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ ఆయిల్ మిల్లర్లు, రిటైలర్లు, హోల్సేలర్ల తో సమా వేశం నిర్వహించి సంప్రదింపులు జరిపామని, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.126 లకు, పామ్ ఆయిల్ రూ.121 లకు అందిస్తామని అంగీకరించారని జేసీ తెలిపారు..టెలి కాన్ఫరెన్స్ లో ఆదొని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో 302 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు







**నంద్యాల, అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి**

జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల కింద ఉన్న 302 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని జిలా కలెక్టరు రాజకుమారి జలవరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మలరామానాయుడుకు వివరించారు. మంగళవారము విజయవాడ నుండి రాష్ట్రంలోని పెద్ద మద్య చిన్నతరహా నీటి పారుదల కింద ఉన్న నీటి వినయోగదారులు సంఘాలతకు ఎన్నికలు నిర్వహించే అంశముపై జిల్లా కలెక్టర్లు జలవనరుల శాఖ అదికారులతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్‌లోన వీడియో కాన్ఫరెన్సు హాల్‌నుండి జిల్లా కలెక్టరు పాల్గొన్నారు. ఈస ందర్భముగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా పరిదిలో కెసి కెనాల్ కింద 86 ఎస్‌ఆర్‌బిసి కింద 49, తెలుగుగంగ కింద 47 మైనరు ఇరిగేషన్ ట్యాంకుల కింద 120 వెరసి మొత్తం 302 సాగు నీటి సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టరు వివరించారు అంతకు ముందు వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర జలవానరుల వాఖ మంత్రి నిమ్మలరామా నాయుడు మాట్లాడుతూరాష్ట్రంలో నీటిపారుదల రంగానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాదాన్యత ఇస్తున్నారని నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను అత్యంత పారదర్శికముగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. అక్టోబరు 16నుంచి నీటి వినయోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని ఇందుకు స్బంబందించి షెడ్యూల్ నామినేషన్ ప త్రాలును కలెక్టరేట్లకు పంపడము జరుగుతుందన్నారు. షెడ్యూల్ విడుదల చేసిన పిదప రోజు వారి కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి వినయోగదారులు సంఘానికి 6మంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలని వారి నుండి అద్యక్ష ఉపాద్యాక్షలను ఎంపిక చేసుకోవాలన్నారు. నీటి సంఘానికి అద్యక్షుని ఎగువ ప్రాంతాల నుండి ఎన్నుకోబడినట్లతే ఉపాద్యాక్షలు దిగువ ప్రాంతాల నుండి మరియు వైస్ వెర్సా నుండి తప్పక ఎంపిక చేయబడాలని మంత్రి చెప్పారు. అనంతరము వివిద అంశాలపై తగు సూచనలు జారీ చేశారు.

## రస్తా పరంబోకు భూమికి 'డి' పట్టాలు ఇచ్చిన తహాశీల్ధార్లపై చర్యలు

**జూపాడుబంగ్లా, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

జూపాడుబంగ్లా మండలంలోని 80 బన్నూరు గ్రామంలో రస్తా పరంబోకు భూమికి డి పట్టాలు మంజూరు చేసిన తహాశీల్దార్ హనుమంతు ఆనంద్, ఆ భూమిని అన్‌లైన్లో నమోదు చేసిన రిటైర్డ్ తహాశీల్దార్‌పై జాకీర్ ఉశేన్‌లపై విచారణ చేసి శాఖపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఉత ్తర్వులు జారీ చేసినట్లు తహాశీల్దార్ చంద్రశేఖర్ నాయక్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. 80.బన్నూరు గ్రామ సమీపంలోని 126 సర్వే నెంబర్ లో 2.22 ఎకరాల రస్తా పరంబోకు భూమికి 2006 సంవత్సరంలో అప్పటి తహాశీల్దార్ హనుమంతు ఆనంద్ గ్రామానికి చెందిన రాజేంద్ర ప్రసాదుకు 1.48 ఎకరాలు, వద్దె క ృష్ణకు 0.36 సెంట్లు, సుబ్బమ్మకు 0.38 సెంట్ల భూమికి డి పట్టాలు మంజూరు చేశారన్నారు. 2014 సంవత్సరంలో తహాశీల్దార్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన జాకీర్ ఉశేన్ ఈ డిపట్టాలకు సంబందించి రైతుల పేర్లను అన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. ఇటీవల 126 ఎ సర్వే నెంబర్‌లోని భూమిని ఆర్డీఓ దాసు ఎస్సీల స్మశానికి కేటాయించి గ్రామ పంచాయితీ స్వాధీనం చేశారన్నారు. అయితే ఈ పరంబోకు భూమికి ముందే డి పట్టాలు పొందిన రైతులు రాజేంద్రప్రసాద్, వద్దె క్రిష్ణలు జెసి కోర్టుకు వెళ్లారన్నారు. అంతే కాకుండా ఆర్డీఓ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాజేంద్రప్రసాదు, వద్దెక్రిష్ణలు హైకోర్టును ఆశ్రయించగా జెసి కోర్టులో పెండింగ్‌లో వున్న పిటీషన్ డిస్పోజల్ అయ్యేంత వరకు పరంబోకు భూమి అనుభవంలో వున్న రైతులను అడ్డుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తహాశీల్దార్ పేర్కొన్నారు. ఈ వివాదానికి కారణమైన పై ఇద్దరు తహాశీల్ధార్లపై విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తహాశీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు.

## అన్నపూర్ణేశ్వరిదేవి అలంకరణలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి

**- ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**

**బనగానపల్లె, అక్టోబర్8, ప్రభాతవార్త:** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం పట్టణంలోని కొండపేట అమ్మవారిశాలలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అన్నపూర్ణేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాధంశెట్టి వేణుగోపాల్, కార్యదర్శి శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం, శాశ్వత గౌరవాధ్యక్షులు పి.ఎస్.ఎస్.నారాయణలతోపాటు ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా కాటసాని రామిరెడ్డి అక్కడికి చేరుకోగానే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలువురు ఆర ్యవైశ్య ప్రముఖులు ఆయనకు బాణసంచా పేల్చి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాటసాని రామిరెడ్డి ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తులాభార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకునన్నారు. తాము అధికారంలో ఉన్నా లేకున్నా ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రతి ఏటా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచండం ఆనందించదగ్గ విషయమన్నారు. ఇందులో ముఖ్యంగా ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంతో మెలిగి ఈ పండుగను జరుపుకుంటారన్నారు. అలాగే ఆర్యవైశ్యులు ఐక్యమత ్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఆర్యవైశ్యులు కేవలం వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం కాటసాని రామిరెడ్డిని బనగానపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం, మహిళా ఆర్యవైశ్య సంఘం, యువజన ఆర్యవైశ్య సంఘం, ప్రపంచ ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువ, పూలమాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయ్‌కుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ రవికుమార్, జక్కా నాగరాజు, కేతేపల్లి చంద్రయ్య, గుండా రవికుమార్, శివరాజు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గొర్రెల పెంపకందార్ల ప్రాథమిక సహకార సంఘం ఏకగ్రీవం



**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 8, ప్రభాతవార్తః**

ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల, మేకల పెంపకం దారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని రాష్ట్ర గొర్రెల పెంపకందారుల సమాఖ్య మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరావు యాదవ్, జిల్లా టిడిపి అధ్యక్షులు పి తిక్కారెడ్డిలు తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసేందుకు 31 మంది నామినేషన్ వేయడం జరిగింది. అయితే టిడిపి అధికారంలో ఉన్నందున బిసిల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని వారి ద్వారా మన ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని గొల్ల కుర్వ యాదవ వర్గాల వారికి న్యాయం జరుగుతుందని వివరించగా కొంతమంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. చైర్మన్‌గా శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా గొల్ల యామ గుర్రప్ప, డైరెక్టర్లు అయ్యన్న యాదవ్, ఎం శ్రీనివాసుల, వెంకటేశ్వర్లు, ఉపేంద్ర, మద్దయ్య, మద్దిలేటి, యన్ చంద్రశేఖర్, యుగంధర్, కె రాముడు, అనిమిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఏకగ్రీవానికి సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## దుర్గా మాత చల్లనరి దీవెన అందరికి కలుగాలి-శిల్పారవి

**నంద్యాల, అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి**

దసరా పర్వదినాన అ దుర్గా మాత చల్లని దీవెన అందరికి కలుగాలని అందరు సుఖశాంతులు ఉండాలని దుర్గా మాతను వేడుకున్నారు. మంగళవారము నంద్యాల మండలోని అయ్యలూరు గ్రామంలో శ్రీదర్గా మాత విగ్రమ ప్రతిష్ట వార్శికోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భముగా మాజీ యంయల్ఏ గ్రామస్తులు బారీ స్వాగతము పలికారలు. అక్కడ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరము అయన మాట్లాడుతూ ప్రత్యేకంగా దసారా శరన్నవరాత్రలి వేడుకల పరవ్దనాలలో శ్రీదుర్గా అమ్మవారి విగ్రమ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావడము ఎంతో బాగ్యంగా బావిస్తున్నామన్నారు. బ్రహ్మండమైన వెండి తోడుగును అమ్మవారి విగ్రహానికి ఏర్పాటు చేసిన అలయ నిర్వహకులు గ్రామ పెద్దలకు అ అమ్మవారి కృసాకటాక్షములు ఎల్లవేలల ఉండాలని కోరారు. అమ్మవారి చల్లని దీవెనలు అందరిక కలుగాలని అన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు బసవేశ్వరరెడ్డి రవికుమారురెడ్డి రషీద్‌యంపిటిసి షఫీ అనిల్‌రెడ్డి ప్రసాదు కటారి బాలుడు సరమేశ్వరరెడ్డి ఐలూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అలంకారంలో దుర్గామాత

**మిడుతూరు, అక్టోబర్08, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మిడుతూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కొలువైన అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమ్మవారికి మహిళలు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన వెంకటరామిరెడ్డి, భూపాల్‌రెడ్డి, వేణులతో పాటు పలువురిని దుశ్శాలువాలతో సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూమా కృష్ణమోహన్, దొంతు కృష్ణమూర్తి, సత్యమయ్య, కటకం వెంకటేశ్వర్లు, దొంతు పరమయ్య, రమణయ్య, గిద్దయ్య, కాశయ్య, పాలయ్య, మహిళా భక్తులు పాల్గొన్నారు.



# వైఎస్సార్ పార్టీ జిల్లా ప్రతినిధుల సమావేశం

**బనగానపల్లె, అక్టోబర్8, ప్రభాతవార్త:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల ముఖ్య నాయకుల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న బనగానపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ సమన్వయ జనరల్ సెక్రటరీ సతీష్‌రెడ్డిలు పాలొ ్గన్నారు. నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ సమన్వయ సమావేశంలో బనగానపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెలే ్య కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలని మరింత బలోపేతం చేయడమే కాకుండా పార్టీని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండడమే కాకుండా ప్రజా సమస్యలను ప్రజల తరుపున వైఎస్సార్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, వైసీపీ అంటేనే పోరాటాల పార్టీ అని, పార్టీని నమ్ముకొని ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే పోలీసుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని వ్యవస్థలు అత్యుత్సాహం చూపేదుతున్నారని కాలం ఒకటే విధంగా ఉండదని దీన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల మాజీ ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగుల బిజేంద్రారెడ్డి, శిల్ప రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, భూమా కిశోర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ధారా సుధీర్‌లు పాల్గొన్నారు.